
అమ్యూజింగ్స్
పుష్పాంజలి కథలు

# అమ్యూజింగ్స్

కథలు

ఎ.పుష్పాంజలి

# "AMUSINGS" - □□□□□ □□□□□□□

## అమ్యూజింగ్స్ - కథలు

**by**

**A. PUSHPANJALI**

**ఎ.పుష్పాంజలి**

ప్రచురణ : జూలై, 2010
ప్రతులు : *1000*
హక్కులు : రచయితవి

:: ప్రతులకు ::
**ఎ.పుష్పాంజలి**
7/85, రవీంద్రనగర్
ఎగువ కురవంక, మదనపల్లె
సెల్: 94400 77586

:: **ముఖచిత్రం** ::

రమణజీవి, హైదరాబాద్ – 9951618021

:: **డి.టి.పి & లే అవుట్** ::
టి.వీరనారాయణరావు, కడప – 9440 591 530

:: **ముద్రణ** ::
విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లి, చిత్తూరు జిల్లా – 517257

:: **మూల్యం** ::
100/– రూపాయలు

# ముందు మాట



**శ్రీమతి ఆర్.వసుంధరాదేవి**
మదనపల్లె

**ప**దేళ్ల క్రితం గుడిపాటి వెంకటాచలంగారి కుటుంబంతో పరిచయం వున్న చలం అభిమానిగా మాత్రమే పుష్పాంజలిగారు నాకు తెలుసు. మదనపల్లెలోని గవర్నమెంట్ కాలేజిలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తుండేవారు. ఆమె 2008లో మదనపల్లెలో స్థిరపడినాకనే సన్నిహిత పరిచయం ఏర్పడింది. ఆమె కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పటి నుంచీ సాహిత్యంలో అభిరుచి వలన విశేషంగా గ్రంథపఠనం, నాటకాల్లో పాల్గొనడం చేస్తూ వుండేవారనీ, లెక్చరర్ అయ్యాక సొంతంగా నాటికలు వ్రాసి తన స్టూడెంట్సు చేత ప్రదర్శింపజేస్తూ, ఒక్కోసారి తాను కూడా పాల్గొంటూ వచ్చినట్లూ తెలుస్తున్నది. సాహిత్యం, జెనెటిక్స్ తన అభిమాన విషయాలని ఆమె చెప్పారు.

ఆమె కథానికల మొదటి సంకలనం "వాళ్లిద్దరూ ఇంకా కొందరు" 2007లో ఆమె రిటైర్‌మెంటుకు ముందుగా ప్రచురించారు. అపారమైన జీవితానుభవం, పరిశీలనాశీలత, వ్రాయాలన్న తపన దోహదం చేస్తుండగా, తర్వాత వ్రాసిన వాటిలో పందొమ్మిది కథలతో "అమ్యూజింగ్స్" అనే ఈ సంకలనం సమర్పిస్తున్నారు.

శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మగారు 20వ శతాబ్ది జనజీవన వేగాన్ని అనుసరించి ప్రపంచ సాహిత్యంలో ఏర్పడిన మౌలిక మార్పును వివరిస్తూ "The short-story when broken up into dialogues will become a one-act play, and a one act play when the dialogues transmuted into narration becomes short-story", అన్నారు (రక్తరేఖ, పేజి. 17-18).

నాటికా రచన నుంచి కథానికా ప్రక్రియలోకి అడుగు పెట్టడం సహజ పరిణామం అనవచ్చును. ఈ క్రమం పుష్పాంజలి కథానికా శిల్పం మీద చాలా

ప్రభావమే చూపించింది. ఈమె కథల్లో సంభాషణలు సహజమూ, స్వాభావికమూ అయిన ఈనాటి భాషా యాసల్తో చలాకీగా వుంటూ, పఠితలను ఆకట్టుకుంటుంది. కథలో సంభాషణల యొక్క ముఖ్య ప్రయోజనాలైన కథను ముందుకు నడిపించడం, పాత్రకు పుష్టినీ, తుష్టినీ కల్పించడం మరచిపోవు. మూస ధోరణిలో సంఘటనను వాచ్యం చెయ్యకుండా కథా సంవిధానంలోకి చొప్పించడం (Show, don't tell) – యీ కాలపు సంవిధానానికి ముఖ్య లక్షణమైన నేర్పు యీామెకు పుష్కలంగా వున్నది. కొన్ని కథల ముగింపు విషయంలో కూడా యీామె ప్రత్యేకమైన నేర్పు చూపించారు. ఉదాహరణకు తెలిసినవాళ్లు, వికారాలు, ఆఖరిఘట్టం కథల ముగింపులు పఠితను ఆలోచనలోకి నెట్టివేస్తవి. ఇవన్నీ శిల్పపరమైన అంశాలు.

కథల్లో ప్రధానంగా విన్పించే స్వరం – ఆధునిక యుగంలో విద్యావతియైన, మధ్యతరగతి భారతనారిది. విషయం – స్త్రీ పురుష సంబంధ వ్యాపారం పలు కోణాల్నుంచీ ఈమెకు ఇప్పటి సాంఘిక వ్యవస్థలో స్త్రీ నిర్వహిస్తున్న పాత్ర గురించి గట్టి అభిప్రాయాలే ఉన్నవి. స్త్రీకి గౌరవ ప్రదమైన ఫెయిర్ డీల్ కోసరం అడుగుతున్నది గాని సమిష్ఠి కుటుంబ వ్యవస్థకు మూల స్తంభమైన వివాహ వ్యవస్థను చలం చెప్పినట్టు నాశనం చెయ్యాలని అనటం లేదు. ఈ వ్యవస్థ అందించే ప్రేమలు, ఆప్యాయతలు సంఘక్షేమానికీ, పటిష్టతకు వెన్నుదన్నులైన సమిష్ఠి బాధ్యతలు ఈమెకు తెలుసు. నేటి ఫెమినిస్టు జాగృతిలో ఈ బాలెన్సు ఒక మంచి పరిణామము.

తెలుగు, హిందీ సినిమాల్లో నుంచి పాటల, మాటల, రాగాల, కూనిరాగాల ద్వారా మనసులో రేగే భావావేశాన్ని వ్యక్తం చేయటం, మామూలు సెంటిమెంటల్ ధోరణి ఆవేశాలూ, కార్యాచరణ ముగింపు లేకపోవడం, ఈ కథల్ని ఆధునిక వర్గీకరణలోకి చేర్చుతాయి.

స్త్రీల పరిస్థితి పట్ల సంఘం చూపుతున్న బాధ్యతా రాహిత్యాన్నీ, స్త్రీకి జరుగుతున్న అపకారాన్ని ఎత్తి చూపే కథలు;

చివరి వరకూ అన్యాయాన్ని సహిస్తూ తనకు చేతనయినట్లుగా బాధ్యతల్ని నిర్వర్తించిన సుభద్ర (ఆఖరి ఘట్టం);

తనకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించే చొరవ లేని దమయంతి (బాధ్యత);

పీడను గుర్తించి గట్టిపడిన అమాయకురాలు, నిస్సహాయురాలు లక్ష్మీకాంతమ్మ (ఏడవకూ... ఏడవకూ);

యీ దురన్యాయాన్ని గురించి ఆత్మవిమర్శ చేసుకొమ్మనే నిలవరిస్తున్నాయి.

కరుడుగట్టిన మూర్ఖమానసంలో కూడా అట్టడుగున మెదిలే ప్రేమ, మార్దవం స్త్రీకి సహజ లక్షణాలని తెలిపే కథ 'మరకల్లో మెరుపులు'.

పరిస్థితులు అహానికి గట్టి కుదుపును ఇచ్చినపుడు ఆలోచనలు స్వార్థపు పరిధిని దాటినట్లు కన్పించినా, స్వస్థత చిక్కగానే ఆచరణ స్వార్థం ఉచ్చులోనే ప్రవర్తిస్తుందనీ, 'నేను' అంటూ వ్యవహరిస్తున్న మనిషి నిజంగా స్వతంత్రుడు కాదనీ, పరిస్థితుల వలయంలో పరిభ్రమించే మిధ్యాహంత మాత్రమేననీ సూచిస్తూ, సంకుచితమైన మానవ నైజానికి అద్దం పట్టే మంచి కథ 'ఆశలపాశం';

పలు ముసుగుల్లో రక్తబాంధవ్యాల్ని ఛిద్రం చేసి ఆత్మబంధువులను 'తెలిసినవాళ్ల' స్థాయికి దిగజార్చుతున్న ధనస్వామ్యం (తెలిసినవాళ్లు);

పాత వ్యవస్థ త్వరితంగా మారుతున్న సందర్భంగా భారతీయ జీవన విధానంలో క్రొత్త దృష్టితో చూడవలసిన అనేక విషయాలు – ముఖ్యంగా భద్ర మహిళలు గుర్తించడానికి నిరాకరించే 'అనైతిక' ఉద్వేగాలను ధైర్యంగా పరిశీలించిన కథలు 'ఇది మల్లెల వేళయనీ...', 'ఒన్లీ బికాజ్...' పుష్పాంజలి గారి ప్రథమ కథల సంపుటంలోనే వున్నవి. ఈ సంకలనంలో కూడా ప్రేమ, మోహము, ఇష్టము వంటి అనుభూతుల్ని చలం స్టైల్లో పరిశీలించడం వున్నది. అనైతికాలను చాప కిందికి నెట్టేసే ఆత్మవంచన లేకుండా 'వికారాలు'గా స్వీకరించడం విశేషం. క్రొత్త సమాజం ఎదుర్కొంటున్న క్రొత్త భావనలకు, క్రొత్త స్పందనలను పుష్పాంజలిగారు ఎలా రూపొందిస్తారోనని పాఠకులు ఆసక్తితో ఎదురు చూడవచ్చు.

విషయ వైవిధ్యం వలన, హాస్య చమత్కార పూరితమైన శైలి వలన, చకచకా చదివించుకపోయే కథలే అన్నీ.... ....

**– శ్రీమతి ఆర్.వసుంధరాదేవి**

13.06.2010

మదనపల్లె



# నా మాటే !

ఎ.పుష్పాంజలి
మదనపల్లె

ఏమ్మా పుష్పాంజలమ్మా!

ఏం రాస్తున్నావమ్మా నువ్వు? ఎందరెందరో రాశారు, రాస్తున్నారు. మీరంతా సువిశాల సాహిత్యాకాశంలో మిలమిల మెరిసే తారలు. ఎంతమంది పాఠకుల హృదయ చంద్రులను చేరగలరో ! నీకొస్తున్న "చంద్రలేఖలు" నువ్వా చేరగలిగావనే చెబుతున్నాయి. ఫరవాలేదు మొత్తానికీ!

నీకేం! నువ్వు కథలు చదువుతుంటే కళ్లు మూసుకొని వింటారు మీ కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్లేగారు. ఇంగిలీసు మీడియంలో చదివి తెలుగు మాధ్యమంలో రాస్తున్న నీ రచనల్లో భాషపరంగానో, భావజాల పరంగానో వచ్చే సమస్యల్ని తీర్చడానికి వారెన్నడూ విసుక్కోరు. నీ కథలపై జరిగే చర్చల్లో తన నిశిత బుద్ధినీ, ఆధునిక ఆలోచనా విధానాన్నీ, ప్రయోగాత్మకతనీ, ప్రాక్టికాలిటీని కూడా రంగరించి నీకు సలహాలిస్తారు. నీకేం!

టి.యస్.ఏ. కృష్ణమూర్తిది జాలిగుండె. "మీరు పరమ క్రూరులు! ప్రేమికుల్ని విడదీస్తారు" అంటాడు అంతా విన్నాక. అదో కితాబుగా భావించి నువ్వు హాయిగా నవ్వుకుంటావు. నీ చుట్టూ నవ్వులే నవ్వులు మరి. జర కూడ జెలసీ లేదు. నీకేం తల్లీ!

కథ ఇచ్చిందే చాలని ఎన్ని కథలైనా ఒక గంటలోనే కచ్చితంగా ప్రూఫులు దిద్దిస్తారు మీ సహృదయులు గురునాథ పిళ్లేగారు. ఎవరికి దొరుకుతారిలాంటివాళ్లు?

"నిండు మనంబు నవనీత సమానము, పల్కు దారుణాఖండల శస్త్ర తుల్యము" అనవచ్చు మీ పురాణం త్యాగమూర్తి వారిని. రేపు పాఠకుల నుంచి వచ్చే విమర్శలన్నీ ఊహించి ముందే మూట విప్పుతారు. మృదు మధుర భాషణతో నీ రచనలను ప్రశంసిస్తారు మీ గాడేపల్లి శివరామయ్యగారూ, మల్లేల గురవయ్య గారూను. నీ సాహిత్య ఫలాలకు ఇంతమంది కాపలా ఉండగా నీకేం తక్కువ?

నీ కథలను తూ.చ. తప్పకుండా చదివే మీ అక్క గీతాంజలిగారూ, తన విస్తృత సాహిత్యాభినివేశంతో నీ కథలు పరిశీలించే నీ తమ్ముడు బాబా – ఈ ఇద్దరూ నీ సహోదరులైయుండటం మీ అమ్మా నాన్నల కృపేగా! అంతేనా? నలభైయేళ్ల స్నేహాన్ని కాపాడుతూ నీ కథలకు మొదటి పాఠకులైన నీ మిత్రులు బుల్లమ్మాయ్, శారద, సుబ్బయ్యా, మాజా... ... అంతా నీ జీవన పయనంలో నీ వెంట వస్తుంటే... ... "ఈమెకేం?" అనిపిస్తుంది. కాదనగలవా? ప్రచురితమైన నీ కథల్ని తప్పకుండా చదివే శ్రీ రాజారెడ్డిగారూ, పుష్పరెడ్డి దంపతులు నీ వియ్యంకులు కావడం కూడా నీ అదృష్టమేగా!

అంతేనా! ఒక్కోసారి నీ అభిమాన రచయితలైన శరత్‌బాబూ, బుచ్చిబాబూ, కొడవటిగంటి నీ కలల్లోకొస్తారు. నువ్వు ఏకంగా పడవెక్కి నిండుగా పారే గంగానదిలో ప్రయాణం చేసి శరత్‌బాబింటికే వెళతావు. ఇంకో కలలో నీ అభిమాన రచయిత్రి రంగనాయకమ్మ నీ ముందు నిలబడి "నీకు మార్క్సిజం తెలుసా? తెలుసుకున్నాకనే రాయి" అంటూ బెత్తం ఝుళిపిస్తారు. దేశ కాల పరిస్థితులను బట్టి మారిపోయే ఈ ఇజాల మీద నీకు నమ్మకం లేదని చెప్తే కొడతారనే భయంతో దోషిలా తలొంచుకుని నిలుచుంటావు పాపం!

జీవితాన్నీ, బతుకునూ, పుట్టుకనూ, చావునూ నువ్వర్థం చేసుకుంది వసుంధరా దేవిని చదివినాకే కదా! ఎవరినీ, దేన్నీ, సీరియస్‌గా తీసుకోనవసరం లేదన్న స్ట్రాటజీ నీకబ్బింది ఆమెవల్లే కదా? సాహిత్య ప్రపంచంలో నీ స్థానమేంటో తెలియజెప్పిన వ్యక్తి ఆమే కదా? ఆమె బోధించే తాత్త్విక చింతన వింటూ, ఆమె పాదాల చెంత చేతులు జోడించి కూచోడం నీకెంతో ఇష్టం. నీ "అమ్యూజింగ్స్"కి ముందు మాట రాసి ఎవరికీ లేని ప్రివిలేజ్ నీకు కల్పించారామె. నీకు మాత్రం ఎంత అదృష్టం!

అన్నిటికీ తోడూ ఎంతో సహనంగా, చక్కగా నీ రాతల్ని డి.టి.పి. చేయడానికి ఎక్కడో కడపలో దొరికాడొక వీరనారాయణుడు. ఇంకేం? ఎప్పటి కప్పుడు డి.టి.పి. అయిపోతాయి నీకు. అందమైన మనసులాంటి అందమైన ముఖ చిత్రాలు గీయగల రమణజీవి నీ అమ్యూజింగ్స్‌కి జీవం పోశాడు. నీకేం?

దాదాపు పన్నెండొందల కథలు, ఇతర నవలలు వెలువరించి అపరాధ పరిశోధన సాహిత్యాన్ని కొత్తమలుపు తిప్పి ఈ కథా ప్రపంచాన్ని సుందరంగా, చైతన్యవంతంగా చేసిన ఆత్మీయ మిత్రుడు, కథాసవ్యసాచి శ్రీ ప్రతాప రవిశంకర్ గారు నీ కథల వెనుక ఒక అదృశ్య శక్తి! ఇంకేం లోటు?

కాబట్టి పుష్పాంజలీ! మ్యూసెస్‌లాగా ఇంతమంది నీ చుట్టూ ఉంటే ఆఫ్టరాల్ ఒక్క అమ్యూజింగ్స్ చేయడం పెద్ద గొప్పా ఏమిటి? గొప్ప కాదని ఒప్పుకుంటావా? సరే మరి!

# ఇందులో...


| | | |
|---|---|---|
| మరకల్లో మెరుపులు | ... | 1 |
| ఈక్వేషన్ | ... | 11 |
| బామ్మగారు – ఇంటర్నేషనల్ స్కూల్ | ... | 16 |
| *(బామ్మగారి సిరీస్‌లో రెండవ కథ)* | | |
| వైరుధ్యం | ... | 25 |
| తడి | ... | 32 |
| అలా – ఇలా | ... | 40 |
| బాధ్యత | ... | 49 |
| ఆశలపాశం | ... | 68 |
| ఏడవకూ... ఏడవకూ... | ... | 79 |
| అమ్యూజింగ్స్ | ... | 86 |
| తెలిసినవాళ్లు | ... | 101 |
| వికారాలు | ... | 113 |
| నేనూ – మాసుబ్బీ | ... | 127 |
| *(బామ్మగారి సిరీస్‌లో మూడవ కథ)* | | |
| తారకమంత్రం | ... | 133 |
| పొదుపులక్ష్మి | ... | 139 |
| ఆఖరిఘట్టం | ... | 146 |
| చేశాక చెప్పు | ... | 153 |
| చాంద్ ఆహేఁ భరేగా | ... | 161 |
| తృప్తి | ... | 174 |

# మరకల్లో మెరుపులు

"కౌసల్యా సుప్రజారామా పూర్వా సంధ్యా... ... ...

... ... ఛీ ఛీ, మాడు ముఖం నువ్వూను, నీ ముఖం లాగానే ఉన్నయ్ నువ్వు కడిగిన గిన్నెలు...

... ... పూర్వా సంధ్యా ప్రవర్తతే ...

... ఛో ... ఛో పోయి తగలడు. మీ అమ్మగార్ని నిద్రలేపు. రాత్రి పన్నెండింటికఘోరించింది.

... ఉత్తిష్ఠ నరశార్దూలా కర్తవ్యం దైవ... ..."

ఒకే గొంతుక నుంచి వినిపిస్తున్న ఈ పరస్పర వ్యతిరేక ధోరణులు కరుణను నిద్రలేపాయి.

ఆ గొంతు అక్క శ్రావణిది. సుప్రభాతం పాడుతూనే పనిపిల్ల చంద్రికని తిడుతూంది.

చంద్రిక అనేక సంవత్సరాలుగా తమ ఇంట్లోనే పనిచేస్తున్న పిల్ల. చాలా నమ్మకస్తురాలు. తనకన్నా వయసులో ఓ ఇరవైయైదు సంవత్సరాలు పెద్దవాడైన మొగుడు తప్ప దానికెవ్వరూ లేరు. ఇప్పుడు చంద్రిక గర్భవతి.

రాత్రి తను లేటుగా వచ్చిందన్న కోపం ఇప్పుడు చంద్రిక మీద చూపెడుతున్నది శ్రావణి. రాత్రి తొందరగా రావాలనే ప్రయత్నించింది. కాని మధూ వదిల్తేనా !

"అమ్మా ! కాఫీ" ఎదురుగా చంద్రిక.

నవ్వుతూ కాఫీ అందుకుంది.

రాత్రి విస్కీ ఇంకా గొంతు మండిస్తూనే ఉంది. కాఫీకన్నా విస్కీ ఏం బావుంటుందసలు?

"నీ చేతి కాఫీకి ప్రాణం లేచొస్తుందే చంద్రీ" అంది. తెగ సంబరపడ్డది చంద్రిక. అప్పటి దాకా శ్రావణి తిట్లతో వాచిపోయిన ఆమె ముద్దు మొఖం వికసించింది.

"రాత్రి లేటుగా వచ్చారా అమ్మా ! పెద్దమ్మ ఆ కోపమంతా నాపైన చూపించింది" అంది నిట్టూరుస్తూ.

"లేచి స్నానం కానీండి. ఆఫీసుకి టైమైద్ది" అంది గ్లాసు తీసుకుని వెళ్తూ. పక్క గదిలోంచి అక్క సణుగుడు వినిపిస్తూనే ఉంది.

'శ్రావణి అసహనం రోజురోజుకీ పెరిగిపోయి వెర్రితలలు దాలుస్తున్నది' … … లేచి స్నానం ముగించి, తయారై, అలవాటు ప్రకారం భర్త ఫొటోకు ఒక్క గులాబీ సమర్పించి వినమ్రంగా నిలుచుంది.

తన అస్థిత్వాన్ని విడమరచే ఆ క్షణమంటే ఆమెకి ఇష్టం. ఆఫీసుకెళ్తూ "వెళ్లొస్తానక్కా" అంటున్న కరుణ వంక చూడనైనా లేదు శ్రావణి. న్యూస్‌పేపర్లో తల దూర్చేసింది.

❖ ❖ ❖

అటెండరు పిలుపందుకొని, ఆఫీసరు మధుమూర్తి గదిలోకి వెళ్ళింది కరుణ. అతను చిన్నబోయి కనిపించాడు.

'ఏం జరిగింది?' కళ్లతో అడిగింది.

అతని ట్రాన్స్‌ఫరార్డర్ ఎత్తి చూపించాడు. అతన్ని భువనేశ్వర్‌కి మార్చారు. ఇదింతకు ముందు నుంచీ అనుకుంటున్నదే. అతనే రిక్వెస్ట్ పెట్టుకున్నాక దిగులెందుకు?

భువనేశ్వర్లో అతని భార్యా పిల్లలున్నారు.

"కంగ్రాచ్యులేషన్స్. ఆల్ ద బెస్ట్" అంది.

"దిగులే లేదా? నీకెంత పొగరు? ఉండు చెప్తా" తర్జనితో బెదిరించాడు. అతని మాటలు పూర్తి కాకుండానే వచ్చి సీట్లో కూచుంది. కాస్త దిగులనిపించింది.

భానుచంద్రతో పరిచయం కూడా ఇలానే అబ్రప్ట్‌గా అంతమైంది. ఈ వూరికి డాక్టరుగా వచ్చిన భానూకి తను పేషంట్. నిజానికి తనకి జబ్బేమీ లేదు. ఆరు నెలలకే సంప్రాప్తమైన విడో సిండ్రోమది. దానికి తోడూ ఒకేసారి ఒకే కుటుంబంలో అన్నదమ్ములను పెళ్లాడిన తనూ, అక్కా ఇద్దరూ ఏకకాలంలో వైధవ్యాన్ని పొందారు. అన్నదమ్ములిద్దరూ ఏర్‌క్రాష్‌లో ఒకేసారి… …

జీవితంలో ప్రతిశుభం వెనకా ఒక అశుభం, ప్రతి కాంతి పుంజం వెంటా మింగేసే చీకటి పొంచి ఉంటాయ్ కాబోలు! మొదట తామిద్దరక్కచెల్లెళ్ళు జాబ్ చేస్తుండేవాళ్ళు. కాని అమ్మా నాన్నా చాలా ట్రెడిషనల్ మనుషులు. పెళ్లయ్యాక తమని జాబ్ మానిపించారు.

ఆ గొప్ప విషాదం మర్చిపోవడానికి శ్రావణి భక్తి మార్గాన్నాశ్రయించింది. అప్పట్లో జీవించి ఉన్న అమ్మా నాన్నా బాగా ప్రోత్సహించారు. ఇంటి నిండా బాబాలు, పూజలు, వ్రతాలు, భజనలూ.

తనూ తొలుత అక్క మార్గంలోనే నడిచింది. కాని తనకక్కడేమీ దొరకలేదు. మళ్ళీ జాబ్‌లో చేరింది. భానూతో పరిచయం జీవితాన్ని మలుపు తిప్పింది. ఆరునెలల తన భర్త సాహచర్యం... రెండేళ్ల భానూ పరిచయం...

ఈ రెండింట్లో భానూతో పరిచయం చాలా థ్రిల్లింగా అనిపించసాగింది.

కానైతే ఒకటి మాత్రం నిజం. తన భర్త బతికే ఉంటే తన జీవితంలోకి భానూగానీ, మధూగానీ, మరింక ఎవరుగాని, ప్రవేశించి ఉండేవాళ్ళే కాదు. భానూ పరిచయం కూడా మధూ పరిచయం లాగానే ట్రాన్స్‌ఫర్తో ముగిసింది.

అసలు అక్కకీ తనకీ హార్మోన్లలోనే ఏదో తేడా ! ఆమె తన కోరికలని సులభంగా చంపేసుకుంది. కాని ఆ పూజల్లో ఆమెకేమైనా దొరికుంటే ఆ అసంతృప్తి ఎందుకు? ఆ కోరికలు చంపుకోవడం తన వల్ల కాలేదే ! దానికి తోడూ భానూ ప్రేమ పెద్ద టెంప్టేషన్ ... ఆ ప్రేమతో తన హృదయం ద్రవిస్తూ ఉండేది. ఎవరి మీదా కోపం వచ్చేదే కాదు. అందర్నీ ప్రేమిస్తూ దయగా చూడాలనిపించేది.

ప్రేమకున్న శక్తి పూజకు లేకపోయిందా?

అక్క మిథ్యా శోధన అశాంతికి దారితీసింది. ఆ అసంతృప్తి ఇతరుల మీద ద్వేషంగా మారింది. అక్క స్థితినర్థం చేసుకున్న తను ఆమెనేమీ అనదు. ఆమె ఏం మాట్లాడినా ఎదురు మాట్లాడదు.

ఇంతా చేసి తనకన్నా కేవలం ఒక్క సంవత్సరమే పెద్ద శ్రావణి. కాని ఇప్పుడు తమ మధ్య ఏర్పడ్డ దూరం ఎవరూ కొలవలేరేమో!

సీనియర్ అసిస్టెంట్ చిత్ర ఎదురుగా కూచొని చెపుతూ ఉంది.

"కరుణా! మధుమూర్తి సార్‌కి ఫేర్‌వెల్ ఇవ్వాలి..."

'ఆఁ, అవును ఫేర్‌వెల్. అప్పుడు భానూకి, ఇప్పుడు మధూకి, రేపు... ఎవరికో' – కరుణ అంతరంగం.

"గెస్ట్‌హౌస్‌లోనే డిన్నరూ, మీటింగూ, ఏదైనా మంచి సిల్వర్ గిఫ్ట్ ప్రెజెంటేషన్..."

తనకు మంగళసూత్రం గిఫ్ట్ ఇస్తానన్నాడు మధు. "అది గిఫ్టిచ్చే వస్తువు కాదు" అంది తను...

చిత్ర ఏవేవో చెప్పేసుకుని వెళ్ళిపోయింది. కరుణ ఏమీ వినలేదు...

**- 2 -**

డ్రస్ మార్చుకుంటుంటే పెరట్లో ఏదో గోల. కర్టెన్ తొలగించి చూసింది కరుణ.

అక్క చేత్తో ఓ బెత్తం పుచ్చుకుని పిల్లల్ని తరుముతోంది. వాళ్ళు అటూ ఇటూ పరుగులు తీస్తూ గోలగోలగా అరుస్తున్నారు.

పెరట్లో తను పూల చెట్లు పెంచింది. పూల దొంగతనానికి ఆ పిల్లలు అప్పుడప్పుడూ రావడం, శ్రావణి వాళ్లని అరుస్తుండడం మామూలే. కాని ఈ వేళ కథ ముదిరి కర్ర రూపంలో వడ్డిస్తూంది. వాళ్లకి దెబ్బలు కూడా తగుల్తున్నాయ్.

పెరట్లోకి పరుగెత్తి ఆమెని ఆపడానికి ప్రయత్నించింది కరుణ. శ్రావణి కోపంతో ఊగిపోతూ ఆ బెత్తాన్ని రెండుగా విరిచేసి ఒకసారి హూంకరించి లోపలికి నిష్క్రమించింది.

"చూడాంటీ... ఎంత దెబ్బ తగిలిందో" తన చేతి మీది ఎర్రని వాత చూపెడుతూ చెప్పాడు పక్కింటి శ్యామ్.

ఇదంతా నవ్వుతూ చూస్తున్న చంద్రికకి ఆయింట్‌మెంట్ తెమ్మని చెప్పి "మరి మీరు ఇతరుల ఇళ్లలో పూలు కోయవచ్చా" అడిగింది కరుణ. పిల్లలేమీ మాట్లాడలేదు...

"పూలు కోసాక దేనికి పనికొస్తాయ్. అవి చెట్లకుంటే అందం. మీకు బిస్కెట్లిస్తాను. ఇక మీదట రారుగా" శ్యామ్‌కి ఆయింట్‌మెంటు పూస్తూ చెప్పింది కరుణ.

"ఇక రామాంటీ. మాకు చాక్‌లెట్లు కూడా ఇస్తారా?"

"ఓ అలాగే" అంది కరుణ.

'అక్క హృదయం పాషాణ సదృశ్యం' అనుకుంటూ చంద్రికని గమనించింది. కడుపులో పాపాయి తన సామ్రాజ్యాన్ని పెంచుకుంటున్నాడేమో, సన్నటి చంద్రిక నడుం విస్తరించింది.

'ఛూ... ఈయమ్మ మనిసి కాదు' శ్రావణి గురించి మనసులో అనుకుంది చంద్రిక. నోరు బాగోలేక కాస్త నిమ్మకాయ ఊరగాయడిగితే కసిరి కొట్టింది. పాపం కరుణమ్మ బజారు నుంచి ఒక బాటిలు పచ్చడి కొని పెద్దమ్మకి తెలియకుండా ఇచ్చింది.

'కన్న తల్లిని కళ్లసూడకున్నా కరుణమ్మ తనకి తల్లి లాంటిది' అనుకుంది చంద్రిక – ఆమె కళ్లు చెమ్మగిల్లాయి.

'చిన్నమ్మగారు అందంగా ఉంది. ఉద్యోగం చేస్తా ఉంది. ఎందుకు లేట్‌గా వస్తాదో మరి! పెద్దమ్మకంత కోపమెందుకో! ఎవ్వరైనా చిన్నమ్మగారి కోసం ఫోను చేస్తే ఎంత కసిరి కొడతదో ఈ పెద్దమ్మ. పూజలూ పునస్కారాలు చెయ్యగానే సరా? మనిషిని మనిషిలాగా సూసేది రాకపోతే మనిషి జన్మ ఎందుకు?' ఆలోచనలో ఉన్న చంద్రిక, శ్రావణి పిలుపు... కాదు అరుపుతో ఈ లోకంలో కొచ్చింది.

"ఏం ముఖమలా వాడిపోయింది?" ఎదురుగా కాఫీ గ్లాసుతో నిలుచున్న చంద్రికనడిగింది కరుణ.

"రాత్రి మా ఇంటికాడ పెద్ద పంచాయతీ. వోడి పెళ్లాం దాని బంధువుల్ని శానామందిని తీసుకొని ఒచ్చి పడ్డది. వోడ్ని దీసుకపోద్దంట".

"వద్దని వొదిలేసి పదేళ్లయింది గదా! ఇప్పుడెందుకు కావాల్సొచ్చాడట?"

"నేను గర్భవతినని తెలుసుకున్నారు. వోడి రెండెకరాల చెక్కకీ వారసుడు పుడతాడని బయం!"

అప్పుడు చూసింది కరుణ చంద్రిక చేతి గాయాన్ని.

"ఏమిటది?" అడిగింది.

"ఏం లేదులేమ్మా. కాస్త లేటుగా వచ్చానని పెద్దమ్మ చీపురు ఇసిరేసింది" కరుణ గబగబా ఆ చిన్న గాయాన్ని స్పిరిట్‌తో క్లీన్ చేసి బాండెయిడ్ వేసింది.

'గర్భంతో ఉందని కూడా లేకుండా... అక్క ఏమిటా విపరీత ప్రవర్తన?' మొదటిసారి శ్రావణంటే ఏవగింపు కలిగింది కరుణకు. 'ఈవాళ రాత్రి తనతో గడుపుతానని మధూకి ప్రామిస్ చేసింది. ఏం చెప్పాలి అక్కకు?' అనుకుంటూ తయారై ఆఫీసుకు వెళ్తున్న కరుణ భర్త ఫొటో ముందు గులాబీ పెట్టడం మాత్రం మర్చిపోలేదు.

ఆయన చిరునవ్వు తనకి సాంత్వననిస్తున్నట్టు తోచింది. ఆఫీసుకెళ్లాక

"అక్కా ఫ్రెండ్‌కి బాగలేదు. చూట్టానికి పక్కూరెళుతున్నా. మరి నా కోసం ఎదురు చూడకు" జవాబు కోసం చూడకుండా ఫోను పెట్టేసింది.

❖ ❖ ❖

రెండో రోజు ఉదయమే ఇంటికొచ్చిన కరుణకి మనసేమీ బాగోలేదు.

రాత్రి మధు ఒకటే ఏడుపు. "నిన్ను విడిచిపోలేను. మనం పెళ్ళి చేసుకుందాం. నాతో పాటూ వచ్చేయ్. నా భార్యని ఒప్పిస్తాను" ఇలా పిచ్చి పిచ్చి వాగుడు.

"కొన్నాళ్లయితే మర్చిపోగలవులే. ఇలాంటి పెళ్లిళ్లు చెల్లవు. అక్కనొదిలి నేనొక్కతినే రాలేనని తెలుసుగా" ... ... ఇలాంటి జవాబులతో అతన్ని ఊరడించిందే తప్ప కన్విన్స్ చేయలేకపోయింది. ఈ గొడవతో కరుణ మనసు ఆందోళనగా ఉంది. చంద్రిక ఈ వేళ రాలేదు. అక్క టెంపర్ తారాస్థాయిలో ఉంది. గిన్నెలు విసిరికొట్టడం, సణుగుడు, చంద్రికని తిట్టుకోవడం లాంటి పనులతో కరుణకి మరింత చీకాకు కలిగింది.

'అదంతా ఆమె అసంతృప్తి నుంచి ఉద్భవించిన అశాంతే' అని మరోసారి అనుకుంది కరుణ. అక్క మీద కోపం వచ్చినప్పుడల్లా ఈ మాట మంత్రంలా జపించాలని నిశ్చయించుకుందామె.

'ఆమె జీవితాన్ని కేవలం ఒకే కోణం నుంచి చూస్తున్నది. జీవితానుభవాలనన్నిటినీ స్పృశించిన మనసులు దేన్నయినా సులభంగా శోషణం చేసుకోగలవు. ఆమెని చూసి జాలిపడడం ప్రస్తుతం తన బాధ్యత' అనుకుంటూ విసుగునణచుకొంది కరుణ. మధు ఆఫీస్‌కి రాలేదు. ఇక రాడు కూడా. చంద్రిక ఎందుకు రాలేదు. దాని ఆరోగ్యం బాగోలేదా? 'వాడు' తన మొదటి భార్యతో వెళ్లిపోలేదు కదా! ఛ... ఛ... అలా ఎందుకు జరుగుతుంది? వరుసకి మామ, క్రానిక్ టీబీ పేషంటుగా చంద్రికనాశ్రయించాడు. ఇక బతకడని అతని భార్య అతనితో తెగతెంపులు చేసుకుంది. ఆ పరిస్థితుల్లో ఆశ్రయం, మందులు, సేవా, అన్నీ సమకూర్చింది చంద్రిక. చివరికి తనని తానే అర్పించుకుంది.

అసలు అంత పెద్దవాడితో, ఆల్‌మోస్ట్ ముసలివాడితో చంద్రిక 'ఆ' పరిచయం ఎలా పెట్టుకోగలిగింది?

ఆ విషయం గురించి తనామెని తిట్టని తిట్టులేదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=155**